మండుటెండలో మధ్యాహ్న భోజనం

బజార్‌హత్నూర్, డిసెంబర్ 17 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం మండు టెండలో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ బడిలో దాదా పు 250 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. పాఠశాల ఆవరణ, తరగతి గదుల్లో భోజనం చేస్తున్నారు. కేసీఆర్ సర్కారు 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగం గా డైనింగ్ హాల్ మంజూరు చేసింది. పనులు ప్రారంభమై గోడలు కూడా కట్టారు. ఇంతలోనే కాంగ్రెస్ సర్కారు అధి కారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో తినడానికి కనీసం నీడ కూడా లేకపోవడంతో మండుటెం డల్లోనే భోజనం చేస్తున్నారు.

• బజార్‌హత్నూర్‌లో విద్యార్థుల అవస్థ

'మన ఊరు- మన బడి' పూర్తిచేయాలి

కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించండి • మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ హయాంలో ప్రారంభించిన 'మన ఊరు- మన బడి' పథకానికి సంబంధించిన బిల్లులు చెల్లించి, పనులు పూర్తి చేయించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. తమ ఊర్లోనే 'మన ఊరు- మన బడి' కింద జడ్పీ హైస్కూల్ భవనానికి స్లాబ్ వేశారు కానీ, గోడలు, కిటికీలు లేవని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం.. ఆ పథకాన్ని అమ్మ ఆదర్శ పాఠశాలగా మార్చింది కానీ, అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేస్తే బాగుండేదని తెలిపారు. చాలా చోట్ల పిల్లలు చెట్ల కింద కూర్చునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధతో పనులు పూర్తిచేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి చైర్మన్ తీసుకెళ్లారు.

• విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరుతూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నేతలు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. దీంతో పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. –హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ

• ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

ఏఎన్ఎం, ఎంపీహెచ్‌ప(ఎఫ్)ల నియామకానికి రాత పరీక్షను తక్షణమే నిలిపివేయాలని మంగళవారం కోఠిలోని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్‌వీ కర్ణణ్‌కు వినతిపత్రం సమర్పించారు. –సుల్తాన్‌బజార్

రేపు మాలల అసెంబ్లీ ముట్టడి

మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య వెల్లడి

ఖైరతాబాద్, డిసెంబర్ 17: సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తూ ఏకపక్షంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ 19న మాల సంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జే చెన్నయ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అన్ని సామాజికవర్గాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణను చేపడుతానని రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు ఆ దిశగా చర్యలు చేపట్టడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు.

ఏఈవో ఖాతాలోకి రైతుబీమా సొమ్ము!

• అధికారులకు బాధితుల ఫిర్యాదు

కురవి, డిసెంబర్ 17: రైతుబీమా సొమ్మును ఏఈవో తన ఖాతాలోకి బదిలీ చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో చోటు చేసుకున్నది. బాధిత రైతు లు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం గుండ్రాతిమడుగు (విలేజీ) గ్రామానికి చెందిన బానోత్ బాలు, కే తం లక్ష్మణ్, హుస్సేన్ ఇటీవల మరణించగా సదరు కుటుంబాలకే రైతుబీమా మంజూరైంది. బానోత్ బాలు, కేతం లక్ష్మణ్ కుటుంబ సభ్యుల నుంచి రూ.5 లక్షల చొప్పున, హుస్సేన్ కుటుంబం నుంచి రూ.3 లక్షలు మొత్తం రూ.13 లక్షలు తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. బాధితులు మంగళవారం అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఏఈవో కల్యాణ్ స్పందిస్తూ.. వారి వద్ద తాను అప్పు కింద తీసుకున్నానని, తిరిగి ఇస్తానని పేర్కొన్నాడు.

బతికుండగానే డెత్‌సర్టిఫికెట్లు

రైతుబీమా, బ్యాంకులో ఇన్సూరెన్స్ సొమ్ము స్వాహా

మెదక్ రూరల్, డిసెంబర్ 17 : బతికుండగానే తమ భర్తలు చనిపోయినట్టు ఓ ఇద్దరు మహిళలు డెత్‌సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఆపై రైతు బీమాతోపాటు బ్యాంకులో ఇన్సూరెన్స్ సొమ్మును స్వాహా చేశారు. ఈ ఘటన మెదక్ జిల్లాలో వెలుగుచూసింది. మెదక్ రూరల్ ఎస్సై మురళి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండలం గుట్టకిందిపల్లికి చెందిన రైతులు పిట్ల శ్రీను, ఎలిగేటి మల్లేశం హైదరాబాద్‌లో ఉంటున్నారు. పిట్ల శ్రీను 2021 మే 22న చనిపోయినట్టు అప్పటి పంచాయతీ కార్యదర్శి పంతులు ప్రభాకర్ సహకారంతో డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. మరో రైతు ఎలిగేటి మల్లేశం 2023 ఫిబ్రవరి 7న చనిపోయినట్టు ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి నరేందర్ సహకారంతో డెత్ సర్టిఫికెట్ పొందారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్నారు. నామినీగా ఉన్న పిట్ల శ్రీను భార్య జ్యోతికి రూ.5 లక్షలు, ఎలిగేటి మల్లేశం భార్య శేఖవ్వకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు పిట్ల జ్యోతి, ఎలిగేటి శేఖవ్వపై మండల వ్యవసాయ అధికారి భార్గవి మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎలుకలు కొరికి.. స్పర్శ కోల్పోయి..

• గురుకుల విద్యార్థినికి నరకయాతన
• ఖమ్మంలో ఓ విద్యార్థినిని 11 సార్లు కొరికిన ఎలుకలు
• టీకా వేయించి చేతులు దులుపుకున్న వసతిగృహ సిబ్బంది
• వ్యాక్సిన్లు వికటించి ప్రాణాపాయస్థితికి టెన్త్ విద్యార్థిని
• పరిస్థితి విషమించడంతో ప్రైవేటు దవాఖానకు తరలింపు
• వారం చికిత్స తర్వాత ఖమ్మంలో కోలుకుంటున్న బాలిక

ఖమ్మం మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని కీర్తిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నేతలు పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి

ఖమ్మం, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గురుకులాలపై సర్కారు అంతులేని నిర్లక్ష్యం విద్యార్థులకు ప్రాణసంకటంగా మారుతున్నది. గత ఏడాది కాలంలోనే సుమారు 40 మంది విద్యార్థుల మరణాలు పరిస్థితికి అద్దం పడుతున్నది. ఓ వైపు ఫుడ్ పాయిజన్ ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఖమ్మం జిల్లాలో ఓ విద్యార్థినిని 11 సార్లు ఎలుకలు కొరకడం కలకలం రేపింది. ఈ ఘటన గత నెలలో జరగ్గా, విరుగుడుగా వేసిన వ్యాక్సిన్ల కారణంగా విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరంగా మారడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లాకేంద్రంలోని ముస్తాఫానగర్‌కు చెందిన సముద్రాల లక్ష్మీభవానీకీర్తి రఘునాథపాలెం మండలం దానవాయిగూడెం బీసీ గురుకుల బాలికల సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి చదువుతున్నది. గత నెలలో హాస్టల్లో రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఆమెను ఎలుకలు కొరకడంతో తీవ్రంగా గాయపడింది. ఆ తర్వాత విద్యార్థినికి ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో రేబీస్ టీకా వేయించి, విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. వారం రోజుల క్రితం విద్యార్థిని తన తల్లికి ఫోన్ చేసి పరిస్థితిని చెప్పుకుంది. వెంటనే ఆమె హాస్టల్‌కు చేరుకొని కీర్తిని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లింది. డాక్టర్లు పరీక్షించి 'ఎలుకలు కొరకడంతో నరాలు చచ్చుబడ్డాయి. అందుకే కాళ్లూ చేతులకు స్పర్శ ఉండడం లేదు.' అని తేల్చారు. వెంటనే చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం కొంత ఆరోగ్యం మెరుగైంది. దీనిపై విద్యార్థిని తల్లి.. హాస్టల్ నిర్వాహకులను ఆరా తీయగా, 'ఎలుకలు కొరికిన వెంటనే రేబిస్ టీకా వేయించాం. ఇక మాకేం సంబంధం లేదు' అంటూ తప్పించుకున్నారు.

పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు..

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం బాలిక, ఆమె తల్లితో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల వద్ద ఆరా తీశారు. అనంతరం దవాఖాన వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఎలుకలు కొరికాయని తాను చెబితే హాస్టల్ అధికారులు 15సార్లు వ్యాక్సిన్ వేయించారని విద్యార్థిని చెప్పిందని పేర్కొన్నారు. అవి వికటించడం వల్లనే ఆమెకు ప్రాణాపాయస్థితి వచ్చినట్టు వైద్యులు చెబుతున్నారని తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కీర్తికి ప్రాణాపాయ స్థితి: వద్దిరాజు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కీర్తికి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. విషయం తెలుసుకున్న వద్దిరాజు.. మంగళవారం ఢిల్లీ నుంచి ఫోన్ చేసి ఆరోగ్యంపై ఆరా తీశారు.

చించోలి గురుకులంలో విద్యార్థుల అస్వస్థత

దవాఖానలో చేరిన పదిమంది

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 17 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి మైనార్టీ గురుకుల పాఠశాలలో పది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి విద్యార్థులు క్యాబేజీ కర్రీతో భోజనం చేశారు. ఇందులో శివవర్ధన్, సాయినాథ్, సైఫ్, నిమ్రాన్, నోమన్‌లకు అర్ధరాత్రి కడుపునొప్పి రావడంతోపాటు విరేచనాలు కావడంతో మంగళవారం ఉదయం నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల దవాఖానలో చికిత్స అందించి సాయంత్రం డిశ్చార్జి చేశారు. మంగళవారం సాయంత్రం మరో ఐదుగురు సోహెల్, బిలాల్, షేక్ అయానుద్దీన్, షేక్ హసీం, అబ్దుల్ మీసన్ కూడా కడుపునొప్పి, విరేచనాలతో దవాఖానలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. విద్యార్థుల అనారోగ్యానికి ఫుడ్ పాయిజన్ కారణం కాదని కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ స్థాయి సమన్వయకర్త విచారణ నివేదిక ప్రకారం సోమవారం సాయంత్రం ఐదుగురు విద్యార్థులు అతిగా స్నాక్స్, ఆహారం తీసుకోవడం వల్ల స్వల్ప అనారోగ్యానికి గురైనట్టు పేర్కొన్నారు. అయితే మంగళవారం అస్వస్థతకు గురైన మరో ఐదుగురి అంశాన్ని కలెక్టర్ ప్రస్తావించకపోవడం గమనార్హం.

గ్రానైట్ రాళ్లను మోస్తున్న విద్యార్థులు

తరగతి గదిలో చదువుకోవాల్సిన విద్యార్థులచే పాఠశాలలో గ్రానైట్ రాళ్లను మోయిస్తున్నారు ఉపాధ్యాయులు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో మంగళవారం 'నమస్తే తెలంగాణ' కంట పడింది. ఉపాధ్యాయులు గ్రానైట్ రాళ్లను తొమ్మిదో తరగతి విద్యార్థులు చేత మోయిస్తూ బడి లోపల ఖాళీ ప్రదేశంలో ఉన్న పూలమొక్కల చుట్టూ పెట్టించారు. – మంచాల

రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివితే స్థానికులే

• వారికి స్థానిక కోటాలో పీజీ అడ్మిషన్లు ఇవ్వాలి
• జీవో 148, 149లు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం
• హైకోర్టు తీర్పు

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్‌ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పింది. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్లు కల్పించాలని స్పష్టం చేసింది. పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్ల నిబంధనలు 2021లోని నిబంధన 8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148, 149లను కొట్టివేస్తూ మంగళవారం 106 పేజీల తీర్పును వెలువరించింది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతో పాటు వాటిని సవరించే అధికారం ఉందని, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేర్కొంది. తెలంగాణలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని తేల్చి చెప్పింది. స్థానిక కోటాకు పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్లకు సంబంధించి 2021 పీజీ మెడికల్ అడ్మిషన్ల నిబంధన-8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం అక్టోబరు 28న తీసుకువచ్చిన జీవో 148, 149లను సవాలు చేస్తూ దాదాపు 98 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించడంగానీ, రద్దు చేయడంగానీ చేయలేదని అందువల్ల అన్వయించుకున్నట్టు భావించాలని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 నేపథ్యంలో తెలంగాణలో రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవన్న వాదన అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల చదువులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

ఎంబీబీఎస్ లోనూ స్థానిక కోటా కింద అడ్మిషన్ పొంది ఉండాలి

ప్రభుత్వం జారీచేసిన జీవో 148, 149ల ప్రకారం రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివినంత మాత్రాన స్థానిక కోటా రిజర్వేషన్‌లకు అర్హులుకాదని హైకోర్టు తెలిపింది. వీటి ప్రకారం ఎంబీబీఎస్‌లో కూడా స్థానిక కోటా కింద అడ్మిషన్‌లు పొంది ఉండాలని పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నాన్‌లోకల్ క్యాటగిరీలో ఎంబీబీఎస్‌లో చేరినవారు స్థానిక కోటా కింద పీజీలకు అర్హులు కాదని తెలిపింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పీజీ అడ్మిషన్‌లు పొందేందుకు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివినవారికే ఎంబీబీఎస్ స్థానిక కోటా కింద అడ్మిషన్‌లు లభిస్తాయని, అలా ఎంబీబీఎస్‌లో సీటు పొందినవారికే పీజీ అడ్మిషన్‌లలో స్థానిక కోటా కింద అర్హత లభిస్తుందని, ఇది చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నాలుగేండ్లు స్థానికంగా చదువుకున్న వారిని స్థానిక అభ్యర్థిగా పరిగణించాలని ధర్మాసనం తేల్చి చెప్పింది. ప్రభుత్వ జీవోలు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమని, అంతేగాకుండా రాష్ట్ర విద్యాసంస్థల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 3(2)కు కూడా విరుద్ధమని పేర్కొంది. పీజీ మెడికల్ కోర్సులకు ఆగస్టు 11న పరీక్ష నిర్వహించగా, ఫలితాలు ఆగస్టు 23న విడుదలయ్యాయి. ప్రభుత్వం అక్టోబరు 28న మెడికల్ అడ్మిషన్‌లలో స్థానిక కోటా నిబంధనను సవరిస్తూ జీవో జారీచేసింది. ఒకసారి అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభమయ్యాక నిబంధనలను సవరించడం సరికాదని ధర్మాసనం పేర్కొంది. ఎంబీబీఎస్ అడ్మిషన్‌ల సమయంలోనూ ప్రక్రియ ప్రారంభమయ్యాక నిబంధనలను సవరించడంపై ఆట మధ్యలో నిబంధనలు మార్చడం సరికాదని ఇదే హైకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేసింది. తెలంగాణలో ఎంబీబీఎస్ చదివినవారికి, ఇతర రాష్ట్రాల్లో చదివినవారికి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత వర్తిస్తే వారిని స్థానిక కోటా కిందనే పరిగణించాలని ఆదేశించింది.

కూల్చిన ఇంటిని సొంత ఖర్చుతో కట్టండి

• స్టే ఉండగా ఎలా కూల్చారు?
• పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట గ్రామంలో స్టే ఉత్తర్వులున్నప్పటికీ అక్రమ నిర్మాణమంటూ కూల్చివేసిన పేదల ఇంటిని పునరుద్ధరించాలని హైకోర్టు మంగళవారం ఆదేశించింది. పేదలు ఇల్లు అయినందున కూల్చివేశారని, అదే ధనవంతులు చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసే ధైర్యం ఉందా అని నిలదీసింది. దోమలపెంటలో కటకం మహేశ్, నాగలక్ష్మి ఓ ఇల్లు కట్టుకొని చాలా ఏండ్ల నుంచి నివాసముంటున్నారు. అది అక్రమ నిర్మాణమంటూ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయగా వారు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు వారి ఇంటిని కూల్చరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీచేస్తూ, కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. ఉత్తర్వులు అమలులో ఉండగా నే ఇంటిని కూల్చివేయడంతో బాధితులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పీ మాధవీదేవి విచారణ చేపట్టారు. అదనపు అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ పంచాయతీ కార్యదర్శి వల్ల ఇది జరిగిందని, ఇది జిల్లా పంచాయతీ అధికారికి తెలియదని చెప్పారు. కూల్చివేసిన నిర్మాణాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

వడ్ల డబ్బులు.. రుణం కింద జమ

లబోదిబోమన్న నిజామాబాద్ జిల్లా చల్లగరిగె రైతు

ధర్పల్లి, డిసెంబర్ 17: రేవంత్ సర్కారు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు వడ్ల డబ్బులను పంట రుణం కింద కొట్టేశారు. దీంతో రైతులు అటు రుణమాఫీ కాక, ఇటు వడ్ల డబ్బులు చేతికందక లబోదిబోమంటున్నారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం చల్లగరిగెకు చెందిన రైతు దంపతులు ఎం రాజేశ్వర్, గంగాజమునకు ధర్పల్లిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో జాయింట్ అకౌంట్ ఉంది. గంగాజమున రూ.75 వేల పంట రుణం తీసుకోగా రుణ మాఫీ అవుతుందని డబ్బులు చెల్లించలేదు. ఇటీవల వడ్లు విక్రయించగా, ఈ నెల 5న రాజేశ్వర్, గంగాజమున జాయింట్ అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యాయి. బ్యాంకు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పంట రుణం కింద ఈ నెల 11న ఖాతా నుంచి రూ.1,06,265 కట్ చేసుకున్నారు. గంగాజమున డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లగా, ఖాతాలో డబ్బులు తక్కువగా ఉండటం చూసి లబోదిబోమన్నారు. దీనిపై ఆరా తీయగా, క్రాప్‌లోన్ మొండి బకాయి కావడంతో ఆటోమెటిక్‌గా డబ్బులు కట్ అయినట్టు బ్యాంక్ మేనేజర్ చెప్పారు. కనీసం చెప్పకుండా ఎలా తీసుకుంటారని ప్రశ్నించగా, అసహనానికి గురైన బ్యాంక్ అధికారులు తాము చేసేదేమీ లేదని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని దబాయించినట్టు బాధితులు 'నమస్తే తెలంగాణ'తో వాపోయారు.

నిందితుడి అనుమానాస్పద మృతి

ఠాణాలోనే ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రచారం

రెంజల్, డిసెంబర్ 17: ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఉన్నతాధికారులు జ్యుడీషియల్ విచారణ చేపట్టారు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం ఓ తండాకు చెందిన వ్యక్తిపై పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. నిందితుడిని ఈనెల 12వ తేదీ రాత్రి రెంజల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్న క్రమంలోనే అతడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ ఈనెల 13 తెల్లవారుజామున మృతి చెందాడని పోలీసులు ప్రకటించారు. అయితే, నిందితుడు ఠాణాలోనే ఆత్మహత్య చేసుకున్నాడని, తన నడుముకు ఉండే దారంతో ఉరేసుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారు. పోస్టుమార్టం రిపోర్టు, జ్యుడీషియల్ విచారణ నివేదిక వచ్చాక సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశమున్నది.

వచ్చే జూన్ నాటికి సనత్‌నగర్ టిమ్స్ రెడీ

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని సనత్‌నగర్ టిమ్స్ దవాఖాను నిర్మాణ పనులను పూర్తిచేసిన వచ్చే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజైన జూన్ 2 నాటికి సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం సనత్‌నగర్ (ఎర్రగడ్డ)లోని టిమ్స్ దవాఖాన నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

ఎంబీఎస్సీ కులాలకు 7% రిజర్వేషన్లుండాలి

హైదరాబాద్, డిసెంబర్17 (నమస్తే తెలంగాణ): దళితుల్లోనే అత్యంత వెనుకబడిన, అణచివేతకు గురవుతున్న(ఎంబీఎస్సీ) 57 కులాలకు ఎస్సీ వర్గీకరణలో 7 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, 'ఏ' వర్గంలో చేర్చాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌ను బీఆర్‌కే భవన్‌లో మంగళవారం ఎస్సీకులాల నేతలతో కలిసి వినతిపత్రం అందించారు. 57 ఎంబీఎస్సీ కులాల స్థితిగతులపై, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయపరంగా ఇప్పటివరకు వాటిల్లిన అన్యాయాన్ని వివరించారు. మాల మాదిగ కులాలతో కలపకుండా 57ఎంబీఎస్సీ కులాలను ప్రత్యేక క్యాటగిరీలోనే ప్రతిపాదించాలని కమిషన్‌ను కోరారు. కర్నె రామారావు డక్కలి, కురువ జయరాములు మదాసి కురువ, లక్ష్మీనర్సయ్య చిందు పాల్గొన్నారు.

'భూ వివాదం'పై విచారణ చేయించండి : ఐజీ

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): భూ వివాదంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదం టూ డీజీపీ ఆఫీసు ఎదుట నిరసనకు దిగి న మైల భాస్కర్‌కు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి భ రోసాఇచ్చారు. వెంటనే అతడి భూ సమస్యపై విచారణ చేపట్టాలని సిద్దిపేట కమిషనర్ బీ అనురాధను ఆదేశించారు. దీంతో మంగళవారం ఉదయం కుటుంబంతో కలిసి సిద్దిపేట కమిషనరేట్‌కు చేరుకున్న భాస్కర్, కమిషనర్‌కు తన గోడు వెలిబుచ్చాడు. తన గోడును వినిపించిన 'నమస్తే తెలంగాణ'కు భాస్కర్ కృతజ్ఞతలు తెలిపాడు.

సర్వే ఫారాలు బీరువాలో భద్రం

నమస్తే ఎఫెక్ట్

నార్నూర్, డిసెంబర్ 17 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ ఎంపీడీవో కార్యాలయంలోని మరుగుదొడ్డిలో ఉంచిన సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు ఎట్టకేలకు బీరువాలోకి చేరాయి. 'మరుగుదొడ్డిలో సర్వే ఫారాలు' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో కార్యాలయ అధికారులు స్పందించారు. సర్వే ఫారాలను బీరువాలో పెట్టారు.

ప్రశ్నార్థకంగా పంచాయతీల మనుగడ

• జనవరి నుంచి నిలిచిన గ్రాంట్స్
• ఎన్నికలు జరుగలేదని కేంద్రం నుంచి నిధులు బంద్
• రాష్ట్రవ్యాప్తంగా రూ.680 కోట్ల వరకు బకాయిలు

కరీంనగర్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏడాది క్రితం వరకూ కళకళలాడిన గ్రామ పంచాయతీలు ప్రస్తుతం పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గడిచిన పదకొండు నెలలుగా గ్రాంటు అందక పంచాయతీ నిర్వహణకు కార్యదర్శులు అష్టకష్టాలు పడుతున్నారు. సొంత జేబుల నుంచి డబ్బులు పెడుతూ అప్పుల పాలవుతున్నారు. పారిశుద్ధ్యం నుంచి బ్లీచింగ్ పౌడర్ వరకు అన్నీ సొంత డబ్బులతోనే కొనుగోలు చేస్తున్న కార్యదర్శుల మొరను రేవంత్ సర్కారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పైగా వివిధ కార్యక్రమాల పేరిట వారిపై అదనపు భారం మోపుతున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. రోజురోజుకూ తడసి మోపెడవుతున్న ఖర్చులను భరించలేక.. ఇప్పటికే పెట్టిన డబ్బుకు సంబంధించిన బిల్లులు రాక, ఇంకా సొంత జేబులనుంచి పెట్టే స్థోమత లేక కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నానా యాతన పడుతున్నారు. బిల్లుల కోసం చేసిన విన్నపాలు బుట్టదాఖలు అవుతుండగా.. కలెక్టర్లు, ప్రత్యేకాధికారులు పూర్తిగా చేతులెత్తేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే అదేశాలను పంచాయతీ కార్యదర్శులపై రుద్దడమే తప్ప.. పైసా విదిల్చడం లేదు.

ఆగిన కేంద్ర, రాష్ట్ర నిధులు

రాష్ట్రంలో సర్పంచ్‌ల గడువు ఫిబ్రవరిలో ముగిసింది. వెంటనే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన ఆరు నెలలలోగా ఎన్నికలు జరగాలి. కానీ, అనేక కారణాల రీత్యా సమీపక్ష భవిష్యత్తులో పంచాయతీ ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. ఎన్నికలు జరగనందున కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని మంగళవారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

అప్పుల పాలవుతున్న కార్యదర్శులు

సాధారణంగా రోజువారీ పనుల కోసం మైనర్ పంచాయతీలలో నెలకు రూ.20వేల నుంచి 25వేలు, మేజర్ పంచాయతీలలో రూ.1.50ల లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చవుతాయి. గ్రామాల్లో ఇంటి పన్ను, పెనాల్టీల రూపయంలో వచ్చే ఆదాయాన్ని కార్యదర్శులు జనరల్ ఫండ్ కింద ట్రెజరీలో జమ చేస్తారు. కనీసం ఈ డబ్బును వినియోగించుకుందామంటే.. ట్రెజరీ అధికారులు ఏప్రిల్ నుంచి చెక్‌లు పాస్ చేయడం లేదు. అడిగితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవని చెప్తున్నారు. నిధులు లేవని పనులు చేయకపోతే ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారని ఓ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాలో 313 పంచాయతీలుంటే.. వాటి పరిధిలో గడిచిన 11 నెలల కాలంలో కార్యదర్శులు తమ జేబుల్లోనుంచి పెట్టిన ఖర్చు సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్లు. ఇది వినడానికి నమ్మశక్యంగా లేకపోయినా అక్షరాల క్షేత్రస్థాయిలో ఇదే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ఇప్పటివరకు సొంత జేబుల నుంచి పెట్టిన డబ్బులు ఇప్పించాలని కోరుతూ.. పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ల ఆధ్వర్యంలో కలెక్టర్లకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదు.